

మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట


# కేంద్రం తలుచుకుంటే గంటలో బీసీ రిజర్వేషన్

- బీసీలను మోసం చేసి బిజెపి, బీఆర్ఎస్ ముసలి కన్నీరు
- కాంగ్రెస్ బీసీలకు రిజర్వేషన్ కల్పించడానికి కట్టుబడి ఉంది
- బీసీ రిజర్వేషన్ల బంద్‌లో పాల్గొనే అర్హత బిజెపికి లేదు
- బీసీ రిజర్వేషన్ బంద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు



కల్వకుర్తి బంద్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు




కల్వకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల పక్షం నాయకులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల పక్షపాతి అని బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది కాబట్టి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించామని రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తలుచుకుంటే పార్లమెంట్ సమావేశాలు గంటపాటు బీసీ రిజర్వేషన్లను కేటాయించడానికి సమయం వెచ్చిస్తే తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కలుగుతుందన్నారు. పార్లమెంట్‌లో చట్టం చేసి తొమ్మిదవ షెడ్యూల్ లో తెలంగాణ బీసీ రిజర్వేషన్లను చేర్చడం ద్వారా అది చట్టంగా మారుతుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో మోసం చేసిన బిజెపికి బందులో పాల్గొనే అర్హత లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనలో భాగంగా బీసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌లో భాగంగా శనివారం అంబేద్కర్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని మాట్లాడుతూ బిజెపి, బీఆర్ఎస్ రెండు పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. బిజెపి పార్లమెంట్లో తీసుకొచ్చిన ప్రతి బిల్లుకు బిఆర్ఎస్ మద్దతు ఇచ్చిందన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి బిజెపితో అంట కాగిన బీఆర్ఎస్‌బీసీలకు ఎందుకు రిజర్వేషన్లు కల్పించలేదని ఆయన ప్రశ్నించారు. బీసీ సమాజంఇచ్చిన బంద్ పిలుపులో బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు పాల్గొనడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఆరోపించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి సారథ్యంలో కామారెడ్డి బీసీ రిజర్వేషన్ ను అమలుపరిచే దిశగా ఏడాదిగా శ్రమిస్తున్నామన్నారు. బీసీల పట్ల బిజెపికి ప్రేమ ఉంటే చట్టం చేసి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని జూపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు. పీవీ నరసింహారావు హయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమిళనాడులో బీసీ రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చి రిజర్వేషన్లు కల్పించిన అంశాన్ని ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తే ఆ క్రెడిట్ అంతా కాంగ్రెస్ కె దక్కుతుందన్న దుర్బుద్ధితో కలిసి వస్తున్నారే తప్ప వీరికి బీసీల పట్ల ప్రేమ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ కల్పించడానికి కృత నిశ్చయంతో ఉందన్నారు. ఆరు నూరైనా బీసీరిజర్వేషన్లు సాధించే తీరుతామని జూపల్లి కృష్ణారావు అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి బీసీలకు రిజర్వేషన్ ఇవ్వలేక బిజెపి ముసలి కన్నీరు కార్చడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి క్రెడిట్ దక్కకూడదని బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు కోర్టులలో కేసులువేయించి అడ్డుకుంటుందని జూపల్లి ఆరోపించారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ ఉర్ రెహ్మాన్, పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీలు సూర్య ప్రతాప్ గౌడ్, కోటయ్య యాదవ్, బండ పర్వతాలు, మల్లయ్య గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి వినోద్, కృష్ణారెడ్డి, పిడికిల్ల పాపమ్మ తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**తెలంగాణ రాష్ట్రం సాధించినట్లే బీసీ బిల్లును సాధించుకుందాం : మంత్రి**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజల కష్టాలను తెలుసుకున్నారని ఆయన పాదయాత్రలో భాగంగానే రాష్ట్రంలో కుల గణన చేశామని రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. బీసీ బిల్లు కేంద్రం వల్లే ఆగిందని కేంద్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంటే ఈరోజు బీసీలకు 42శాతం రిజర్వేషన్ దక్కేదని ఆయన అన్నారు. 70 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో 120 సార్లు రాజ్యాంగాన్ని సవరించారని పేర్కొంటూ బీసీల కోసం రాజ్యాంగ సవరణ చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బందులో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని బస్ డిపో ముందు ఏర్పాటుచేసిన బిసి బంద్ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ రాజకీయ లబ్ధి కోసం కాదని బీసీల్లో సామాజిక ఆర్థిక రాజకీయ విద్యా ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెంపొందించడం కోసమేనని మంత్రి స్పష్టం చేశారు. బీసీ బిల్లు కోసం అన్ని పార్టీల ఎంపీల మద్దతు కూడా గట్టామని పేర్కొంటూ ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద దేశంలోని సుమారు 100 మంది ఎంపీల మద్దతు కూడగట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కాలని ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి నినదించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమంమనీ ఆయన పేర్కొన్నారు. తెలంగాణరాష్ట్రం సాధించినట్లే బీసీబిల్లును సాధించుకుందామని బీసీ సామాజిక వర్గానికి ఆయన పిలుపునిచ్చారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం బంద్‌లో మద్దతు తెలుపుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి బంద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**బీసీల పక్షాన బీఆర్ఎస్ ఏ ఉద్యమానికైనా సిద్ధమే -మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**

బీసీల పక్షాన టిఆర్ఎస్ పార్టీ ఏ ఉద్యమానికైనా సిద్ధమేనని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. కల్వకుర్తి డిపో ముందు నిర్వహించిన బీసీ బందులో ఆయన పాల్గొని సంఘీభావ ప్రకటించి ప్రసంగించారు. గతంలో కూడా టిఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు మద్దతుగా నిలిచిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్ మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్ అని ఆయన అన్నారు కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు బృంగి ఆనంద్ కుమార్, రాచోటి శ్రీశైల, విజయ కుమార్ రెడ్డి, ఎడమ సత్యం, సదానంద గౌడ్, రాజేందర్, గోపాల్, ఆనంద్, భగత్ సింగ్, విజయ్ గౌడు, కృష్ణ గౌడ్, బోడ నరసింహ, సురేందర్ గౌడ్, బాబీ దేవ్, ముదిరాజ్ శ్రీకాంత్, కరెంటు రాజన్న, శేఖర్ ముదిరాజ్, శ్రీనివాసులు, నాని యాదవ్, ఆర్టీసీ కార్మికులు ఉద్యోగులు జర్నలిస్టులు న్యాయవాదులు బిసి ఉద్యమ నేతలు పాల్గొన్నారు.

## బిసి బిల్లును ఆమోదింప చేయాలి

● వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, అక్టోబరు 18 ప్రభాత వార్త:** తెలంగాణలోని బిజెపి నాయకులు ద్వంద్వ వైఖరిని విడనాడి ఇప్పటికైనా బిసి 42శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదింప చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణలో బీసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ తమ సంపూర్ణ మద్దతును ప్రకటించడంతో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్ ఆధ్వర్యంలో చేపట్టిన బంధు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బంద్ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీలో పాల్గొని, ఈ సందర్భంగా వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ రాష్ట్రంలో ఓ లాగా కేంద్రంలో మరో లాగా వ్యవహరించడం తగదని రాష్ట్రంలో ఉన్న బిజెపి నాయకులు 42 శాతం బీసీ రిజర్వేషనుకు మద్దతు తెలుపుతూ కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. రాజ్యాంగ సవరణతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ఉద్దేశంతో ఆనాడు రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని ఆయన అన్నారు. అన్ని కులాలు అన్ని మతాలకు న్యాయం జరిగేలా న్యాయబద్ధంగా రాజ్యాంగం కల్పించిన హక్కులతో తెలంగాణలో ఇంటింటా సర్వే నిర్వహించిన బీసీ సర్వే ఆధారంగా 56% జనాభా ఉన్న బీసీలకు 42% శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ఉద్దేశంతో అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో క్యాబినెట్ ఆమోదం పొంది గవర్నర్, రాష్ట్రపతి ఆమోదాలకు పంపించారని తెలిపారు. 56% జనాభా ఉన్న బీసీ బిల్లుకు 42 శాతం రిజర్వేషన్తో అన్ని రాజకీయ పార్టీల మద్దతు తెలిపాయని నరేంద్ర మోడీ బీసీ రిజర్వేషన్లపై స్పందించకపోతే ప్రజాక్షేత్రంలో పరాభవం తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, పట్టణ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు, సమన్వయకర్త లక్కాకుల సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ దూసుకెళ్లడంతో మహిళ మృతి

- మరొకరికి గాయాలు



దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతి చెందిన అనంతమ్మ(ఫైల్)

**ఊట్కూర్, అక్టోబరు 18 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని నిడుగుర్తి గ్రామంలో దుర్ఘటన చోటుచేసుకుంది. నిన్న ఉదయం 8:30 గంటల సమయంలో గ్రామానికి చెందిన బీబక్ అనంతమ్మ (55) పెరుగు తీసుకురావడానికై ఇంటి వెనకాల ఉన్న సదువు కృష్ణ రెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ కృష్ణ రెడ్డి కూతురు మంజులతో అనంతమ్మ ఇంటి ముందు మాట్లాడుకుంటూ ఉండగా, అదే సమయంలో కృష్ణ రెడ్డి అల్లుడు సదువు ఆంజనేయులు ట్రాక్టర్‌ను పొలం పనుల నిమిత్తం స్టార్ట్ చేయగా, అది నియంత్రణ తప్పి వేగంగా ముందుకు దూసుకెళ్లింది. దీంతో అనంతమ్మ, మంజులపై నుంచి ట్రాక్టర్ దూసుకెళ్లగా, అనంతమ్మకు తీవ్ర గాయాలుకాగా, మంజుల కాలు విరిగింది. వెంటనే కుటుంబ సభ్యులు వారిని ఆసుపత్రికి తరలించగా వైద్యులు అనంతమ్మ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై అనంతమ్మ మేనల్లుడు రామకృష్ణ రెడ్డి ఫిర్యాదు మేరకుపోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

## డీసీఎంను ఢీకొన్న కారు ఇద్దరు మృతి



డిసిఎంను ఢీకొన్న కారు

**పెబ్బేరు, అక్టోబరు 18 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున మూడు గంటల 30 నిమిషాల ప్రాంతంలో నేషనల్ హైవే రోడ్డు పై హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్లే దారిలో అతివేగంతో డీసీఎం డ్రైవర్ సడన్ బ్రేక్ చేయడం వల్ల వెనకాల ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా డిసిఎంలో ఢీకొనడం వల్ల అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జరిగింది. పెబ్బేర్ ఎస్సై యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి కర్నూల్ ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి బ్యాండ్ బృందం కారులో ప్రయాణిస్తుండగా డీసీఎం సడన్ బ్రేక్ వేయడం వల్ల అక్కడికక్కడే ఇద్దరు మరణించారని వారు డ్రైవర్ నాగరాజు, మనీష్ ఇద్దరు మృతి చెందారని. మిగతా ఇద్దరికీ దెబ్బలు తగిలినట్లు హైదరాబాద్ కొంపల్లికి చెందిన విశాల్ పిరిని వనపర్తి గవర్న మెంట్ హాస్పిటల్‌కు తరలించామని మనీష్ తండ్రి జంగాల రాజేష్ ఫిర్యాదు మేరకు డిసిఎం డ్రైవర్ పై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్సై యుగంధర్‌రెడ్డి తెలియజేశారు.

## సిపిఆర్‌పై పోలీసు సిబ్బందికి అవగాహన

**సిపిఆర్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ప్రాణాలను కాపాడాలి : నారాయణ పేట జిల్లా ఎస్పీ డా. వినీత్**



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణ పేట, అక్టోబరు 18 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఎస్పీకార్యాలయంలో లైఫ్‌సేవర్ అసోసియేషన్ ఢిల్లీ వైద్య నిపుణులు డా. రాకేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి సిపిఆర్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా వినీత్ మాట్లాడుతూ సిపిఆర్ పద్ధతులు ప్రతి పోలీసు సిబ్బంది నేర్చుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు లేదా ఊపిరి ఆడక ఇబ్బంది పడుతున్న వ్యక్తుల ను సిపిఆర్ ద్వారా ప్రాణా పాయ స్థితి నుండి కాపాడవచ్చని తెలిపారు. పోలీసులు ప్రజలతో ఎల్లప్పుడూ ప్రత్యక్షంగా పనిచేస్తారని కాబట్టి ఇలాంటి శిక్షణలు వారికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఆసుపత్రికి తరలించేలోపు సిపిఆర్ ఇవ్వడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని వివరించారు డా. రాకేష్ ఛాతీ కుదింపులు కృత్రిమ శ్వాస వంటి సిపిఆర్ విధానాలను ప్రాక్టికల్‌గా చూపిం చారు.



సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎవరైనా అపస్మారక స్థితిలో కింద పడిపోయినప్పుడు చేయాల్సిన చర్యలపై పోలీసులకు అవగాహన కల్పించారు. ఎస్పీ ప్రతి పోలీస్ సిబ్బంది సిపిఆర్ నేర్చు కుని ఇతరులకు నేర్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎమ్ హెచ్ఓ జయచంద్ర, మోహన్, స్టాఫ్ విజయ్ కుమార్, ఆర్ఐ నరసింహ, ఎస్సైలు నరేష్, పురుషోత్తం, శివశంకర్, మద్దయ్య, శ్వేత, శిరీష తదితర జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

## నా ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**




ఎమ్మెల్యే జిఎంఆర్ మొబైల్ హ్యాక్ అయినట్లు చూపిస్తున్న దృశ్యం

**దేవరకద్ర, అక్టోబరు 18 ప్రభాతవార్త:** ఈ మధ్య కాలంలో సైబర్ నేరగాళ్ల రోజురోజుకు రెచ్చిపోతు న్నారు. రాజకీయ నాయకులు, బిజినెస్ మ్యాన్‌లనే టార్గెట్‌గా చేసుకుంటున్నారు. వారికి తెలియకుండానే వారి మొబైల్‌ని లేదా సిస్టంని హ్యాక్‌చేస్తూ, నేరాలకు పాల్పడుతున్నారు. తాజాగా దేవరకద్ర ఎమ్మెల్యే మధు సూదన్ రెడ్డి మొబైల్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే స్వయంగా తెలిపారు. వాట్సాప్ నుంచి డబ్బులు పంపించాలని సందేశాలు పంపుతున్నారని చెప్పారు. అలా ఎవరైనా తన ఫోన్ నెంబర్ నుంచి మెసేజ్ లు పంపితే, ఎవరు డబ్బులు పంపించొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు.

## యువత అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దు



వాహనాలను తనిఖీ చేసి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** నేటి యువత క్షణికా వేషాల్లో, ప్రాత్యా మోజులో పడి జీవితాలను విచ్చిన్నం చేసుకుంటున్నారని కల్వకుర్తి సీఐ ఆవేదన వ్యక్తం చేశారు. యువత తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాల బారిన పడద్దని కల్వకుర్తి సీఐ నాగార్జున హితవు పలికారు. శనివారం స్థానిక బస్‌డిపో సమీపంలో యువకులకు మాదకద్రవ్యాలు ఇతర మత్తు పదార్థాల పట్ల అవగాహన కల్పించారు. ఒక్కసారి దురలవాట్లకు బానిస అయితే జీవితం నాశనమై పోతుందని అన్నారు. కళాశాలకు వెళ్లే విద్యార్థులు యువకులు సరైన పద్ధతిలో ఉండా లని వేషధారణ కూడా జీవితాలను ప్రభావితం చేస్తుందని హితవు పలికారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రవర్తనపై నిఘా పెట్టాలని సూచిం చారు. చిన్న వయసులో సిగరెట్టు గుట్కా గంజాయి ఇతర వ్యసనాల బానిసకావద్దని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకించి ఇంటర్మీడియట్ డిగ్రీ చదివే పిల్లలు మంచి చెడుల పట్ల ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. కళాశాలకు వెళ్లే విద్యార్థుల వాహనాలను తనిఖీ చేసి వారికి గంజాయి సిగరెట్టు గుట్కా ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల వచ్చే అనర్థాల పట్ల అవగాహన కల్పించారు.

## బ్రహ్మోత్సవాలకు 100 బస్సు సర్వీసులు

● జిల్లా ఆర్టీసి రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్



శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న ఆర్టీసీ అధికారులు

**మహబూబ్‌నగర్ (చిన్న చింతకుంట), అక్టోబరు 18 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలువబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా ఆర్టిసి రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్‌తో పాటు డిఎం సుజాతతో కలిసి జాతర మైదానంలోని బస్సు సర్వీసులను నిలిపే ప్రదేశాలను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గత సంవత్సరం లాగే ఈసారి కూడా మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, కొల్లాపూర్, వనపర్తి డిపో ల నుంచి సుమారు 100 బస్సు సర్వీస్ లను నడపనున్నట్లు ఆయన తెలిపారు. కౌకుంట్ల నుంచి జాతరకు వచ్చే ఆర్అండ్‌బి రహదారి వెంకటగిరి గ్రామం వద్ద రైల్వే పనులు కొనసాగుతూ ఉండడంతో పక్కనే తాత్కాలికంగా మట్టి రోడ్డుపై వాహనాలు కొనసాగుతున్నాయి. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో అట్టి విషయాన్ని దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి దృష్టిలకు తీసుకెళ్లడం జరిగిందని వారు తెలిపారు. మట్టి రోడ్డు మరమ్మతులను కూడా చేపడుతామని వారు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. అనంతరం శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు ఆలస్యం

- పత్తి బంతులు ఎండబెట్టి సిద్ధం చేసుకున్న కొనుగోలు కేంద్రాలు లేక నిరీక్షణ
- ఆందోళనలో రైతులు

**ఊట్కూర్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా పత్తి పండించిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికీ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలంలోనే పత్తి బంతులు ఎండబెట్టి సిద్ధం చేసుకున్నా కొనుగోలు కేంద్రాలు లేక నిరీక్షణలో ఉన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే చాలా తక్కువగా ప్రైవేట్ వ్యాపారులు ధర చెబుతున్నారు. అయినా పంట పాడైపోతుందేమోనని ఆందోళనతో అమ్మకానికి తప్ప వేరే మార్గం లేదు" అని రైతు వెంకటేశ్ వాపోయాడు. ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు చేయడానికి అప్పులు చేసిన రైతులు ఇప్పుడు తక్కువ ధరలకు పత్తి అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం సమయానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మాకు న్యాయం చేయాలి" అని రైతులు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని చెబుతున్నారు. అయితే రైతులు మాత్రం ప్రతి సంవత్సరం ఇదే మాటలు వినిపిస్తాయి, కానీ చర్యలు ఆలస్యం అవుతాయి" అని నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



కొనుగోలుకు సిద్ధంగా ఉన్న పత్తి



## ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీసీ బంద్ సంపూర్ణం

- కదలని ఆర్టీసీ బస్సులు.. ప్రజా రవాణా బంద్
- మూతపడ్డ పెట్రోల్ బంకులు
- సాయంత్రం వరకు మూసి ఉన్న వ్యాపార సముదాయాలు
- బిసి సంఘాలకు మద్దతు ప్రకటించిన ఆయా సంఘాలు, రాజకీయ పార్టీలు

లోపలి పేజీలో..

## ప్రభుత్వ కళాశాలకు క్రీడా సామాగ్రి కొనుగోలు



క్రీడా సామాగ్రి కొనుగోలు చేసి కళాశాలలో పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ అక్టోబర్ 18,ప్రభాతవార్త;** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడలను అభివృద్ధి పరిచయ కార్యక్రమంలో భాగంగా ప్రవేశపెట్టినటువంటి పథకానికి సంబంధించి క్రీడా సామాగ్రిని కొనుగోలు చేసి శనివారం రోజు ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సైదులు విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయిలో కూడా పాఠశాల విద్యనుండే క్రీడలను అభివృద్ధి పరిచే కార్యక్రమం లో భాగంగా పాఠశాలలకు , ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు క్రీడా సామాగ్రి కొనుగోలు చేసేందుకుగాను బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించి నిధులు విడుదల చేయడంతో క్రీడా సామాగ్రిని కొనుగోలు చేసే విద్యార్థిని విద్యార్థులను క్రీడల్లో రాణించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన సిబ్బంది విశ్వేశ్వర్, కురుమూర్తి తదితరులతో పాటుగా అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జూరాలలో గాంధీ విగ్రహం ఎదుట నిరసన

**ఆత్మకూర్ అక్టోబర్18, ప్రభాతవార్త;** ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో బీసీ రిజర్వేషన్ల సాధనకు మద్దతుగా కాంగ్రెస్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసాద్ తదితరులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలంటూ అన్ని పార్టీల బంద్ కార్యక్రమానికి మద్దతుగా జూరాల గ్రామంలో కాంగ్రెస్ సిపిఐ ఎంఎల్ మాస్లైన్ పార్టీలు వినూత్నంగా గాంధీ విగ్రహంతో నిరసన నిర్వహించి గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ కారక్రమంలో తిరుపతయ్య గౌడ్, మధు, నర్సింలు, తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బండ ప్రకాష్ జన్మదిన వేడుకలు



ఎమ్మెల్సీ బండ ప్రకాష్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

**భూత్పూర్,అక్టోబర్ 18,ప్రభాతవార్త :** తెలంగాణ శాసనమండలి ఉప సభాపతి ఎమ్మెల్సీ బండ ప్రకాష్ 72వ జన్మదిన వేడుకలు శనివారం భూత్పూర్‌లో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు,కార్యకర్తలు స్వీట్లు పంచి పెట్టుకున్నారు.బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,ప్రధాన కార్యదర్శి తూము శ్రీనివాస్‌రెడ్డితో పాటు నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,మనెమోని సత్య నారాయణ, టిమురళిధర్‌గౌడ్,మేకల సత్యనారాయణ,సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్,సత్తూర్ అశోక్‌గౌడ్, రాము రాథోడ్,గడ్డం రాములు,గొడుగు వెంకటరాజు,గడ్డం ప్రేమ్‌కుమార్,సత్తూర్ రాకేష్‌గౌడ్ తదిత రులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

**ఉప్పునుంతల, అక్టోబరు18 ప్రభాతవార్త:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పునుంతల శాఖ పరిధిలోని జయరాం తండా సబ్ సెంటర్ ను ప్రాథమిక వైద్యాధికారిణి డా. స్వప్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌లో జరుగుతున్న సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వైద్యాధికారిణి డా. స్వప్న పరిశీలించారు. వ్యాక్సిన్



జయరాం తండాలో సార్వత్రిక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్య అధికారిణి డా. స్వప్న

క్యారియర్‌లో నిల్వ ఉంచిన టీకాలను పరిశీలించారు. టీకా లబ్ధి దారుల వివరాలను పరిశీలించి ప్రతి ఒక్కరికి టీకాలు ఇచ్చేందుకు ప్రణాళిక చేసుకోవాలని ఆమె సూచించారు. వైద్య సిబ్బంది ఎల్లవేళలా ఆరోగ్య ఉప కేంద్రంలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ తనిఖీలు వైద్య అధికారిణి డా. స్వప్నతో పాటు ఎంపిహెచ్ఓ మధు నాయక్, ఏఎన్ఎం దేవి,వీణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పునుంతల తహసీల్దార్‌గా అద్దంకి సునీత



**ఉప్పునుంతల, అక్టోబరు18 ప్రభాతవార్త :** ఉప్పునుంతల తహసీల్దార్‌గా అద్దంకి సునీత శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన తహశీల్దార్ ప్రమీల బదిలీ పై వెళ్లడం తో ఆమె స్థానంలో చారగొండ తహశీల్దార్‌గా పని చేసిన అద్దంకి సునీత బదిలీపై ఉప్పునుంతలకు వచ్చారు. గత సంవత్సరం 2024 జులై నెలలో ఉప్పునుంతల తహ సీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన 45 రోజుల తర్వాత అనతికాలంలోనే సెప్టెంబర్ నెలలో బదిలీ పై చారగొండ తహశీల్దార్ గా వెళ్లారు. తిరిగి సంవత్సరం కాలం పూర్తి కాగానే ఉప్పునుంతల తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజల సహకారంతో ప్రభుత్వ పథకాల పై పారదర్శకంగా అమలు చేయడం జరుగుతుందని తహశీల్దార్ అద్దంకి సునీత పేర్కొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు

**మద్దూరు, అక్టోబరు 18 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూరు, కొత్తపల్లి మండల పరిధిలోని శనివారం డా. సబిత, డా. విశాల ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు టీకాలు వేయడం జరిగింది. మండల పరిధిలోని పెదిరిపాడు, రేణివట్ల, పల్లెర్ల, గోకుల్ నగర్, చేన్వార్ గ్రామాల్లో 138 ఆవులకు 96 గేదెలకు గాలికుంటు టీకాలు వేయడం జరిగిందని డా. సబితతెలిపారు. డా. వి శాల, పశు వైద్య శాఖ సిబ్బంది విఏ దేవేందర్, యుద్ధం నాయక్, గోపాలమిత్ర బృందం రైతులు పాల్గొన్నారు.

## కొండాపూర్ గురుకుల అధ్యాపకుడికి డాక్టరేట్

### అభినందించిన ప్రిన్సిపల్ రాజారాం



డాక్టరేట్ అందుకున్న అధ్యాపకుడిని సన్మానిస్తున్న దృశ్యం

**ధన్వాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త :** ధన్వాడ మండలం కొండాపూర్ గిరిజన బాలుర గురుకుల కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్న రాజా శ్రీనాథ్ రెబ్బను శనివారం ప్రిన్సిపల్ ఎం. రాజారాం శాలువా, పూల బొకెతో సత్కరించారు. రాజా శ్రీనాథ్ పాలమూరు యూనివర్సిటీలో సూక్ష్మజీవ శాస్త్రంలో తన డాక్టరేట్‌ను పూర్తి చేశారు. పియు స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కొండాపూర్ గురుకుల ప్రిన్సిపల్ మరియు అధ్యాపక బృందం డాక్టర్ రాజశ్రీనాథ్ ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రాజా శ్రీనాథ్ తన వృత్తి జీవితంలో మరెన్నో అవార్డులు, రివార్డులు పొందాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వైస్ ప్రిన్సిపల్ సాంబయ్య నాయక్ అధ్యాపకులు లక్ష్మయ్య, పురుషోత్తం, ఉపాధ్యాయులు నరేంద్ర మూర్తి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

**-మభ్యపెట్టి మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి -భూత్పూర్ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతల విమర్శలు**

**భూత్పూర్,అక్టోబర్ 18,ప్రభాతవార్త :** బీసీల 42శాతం రిజర్వేషన్ బిల్లు కోర్టులో వీగిపోతుందని తెల్సికూడా అమలు కాని బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లును రాష్ట్ర కేబినెట్‌చే ఆమోదింపజేసి గవర్నర్ ఆమోదం పొందకుండా,పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టకుండా రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్డ్‌లో చేర్చకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల మెప్పుపొంది ఓటు బ్యాంకును సాధించాలని వారిని మభ్యపెట్టి హడాహుడిగా 42 శాతం బిల్లును కోర్టులో ప్రవేశపెట్టినట్లు బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రప్రభుత్వంపై తీవ్ర స్థాయిలోధ్వజ మొత్తారు. శనివారం భూత్పూర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,బీసీల జేఏసీ భూత్పూర్ మండల కన్వీనర్ మేకల సత్యనారాయణ,జిల్లా మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు మనెమోని సత్యనారాయణలు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణ సాధ్యంకాని,అమలుకు నోచని 42శాతం బీసీల బిల్లు తూతూ మంత్రంగా చేశారని,కేబినెట్ ఆమోదం తర్వాత, గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత పార్లమెంట్ ఉభయసభల్లో ఏకాభిప్రాయం పొందే విధంగా కృషిచేసి బిల్లును రాజ్యాంగం తొమ్మిదో షెడ్యూల్డ్‌లో పొందుపర్చాల్సిన అవసరం ఉందని,ఆవేమి ప్రయత్నాలు చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి బీసీల ఓట్లకోసం,బీసీలను మభ్యపెట్టి మోసం చేశారని ఆరోపించారు.బీసీల సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పండించే తమ ప్రభుత్వ హయాంలో తమ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కృషిచేశారని పేర్కొన్నారు.బీసీల పట్ల చిత్తశుద్ధికల్గిన పార్టీ తమ బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు.మీడియా సమావేశంలో పార్టీ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,టి మురళిధర్‌గౌడ్,సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్,సత్తూర్ అశోక్‌గౌడ్,రాము రాథోడ్, గడ్డం రాములు గొడుగు వెంకటరాజు,గడ్డం ప్రేమ్‌కుమార్,సత్తూర్ రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

# ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు



ధన్వంతరి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఊట్కూర్, అక్టోబరు 18 ప్రభాతవార్త :** ఊట్కూర్ కేంద్రంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు తారకృష్ణ మాట్లాడుతూ వైద్యో నారాయణో హరిః" అంటే వైద్యుడు మహా విష్ణువు స్వరూపుడు" అని అర్థం వస్తుందని తెలిపారు. ధన్వంతరి విష్ణువు అవతారంగా వైద్యానికి, ఆయుర్వేదానికి పితామహుడిగా పూజించబడతారని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు వెంకటేష్, కోశాధికారి రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వేడుకలో ధన్వంతరి దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయుర్వేద ప్రాముఖ్యతను వివరించారు.

**ఖిల్లాగణపురం అక్టోబర్ 18, ప్రభాతవార్త;** మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో శనివారం ప్రాచీన ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరి జయంతి వేడుకలను నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బెన్నూరు,ఆశన్న మాట్లాడుతూ ప్రాచీన కాలంలో ఆయుర్వేదిక్ వైద్యం అందించిన ధన్వంతరి నాయి బ్రాహ్మణ కులంలో పుట్టడం తమ అదృష్టంగా భావిస్తున్నామని ఆయన సేవలు దేశానికి ఆయుర్వేద అందించిన గొప్ప ఆయుర్వేద పితామహుడు అని కొనియాడారు. నాయి బ్రాహ్మణుల వృత్తులు మూడు రకాలుగా ఉన్నాయని మొదటిది ప్రాచీన వైద్యం కాగా రెండోది క్షవర వృత్తి అని మూడోది నాదస్వరం వాయించడం అన్నారు. ఈ కులానికి చెందిన కులవృత్తులను కాపాడుకోవడంలో బాధ్యత తమ నాయి బ్రాహ్మణుల అందరిపై ఉందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం దేవాలయపాలకమండలులలో మా వృత్తులకు సంబంధించిన వారిని గుర్తించి దేవాలయ పాలకమండలిలో కమిటీ సభ్యులుగా అవకాశం కల్పిస్తూ జీవో జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సామ్యా నాయక్, బుచ్చిబాబు గౌడ్, యాదగిరి, గ్రామ ప్రజలు, ఎం.శేఖర్ నరసింహులు,నరేందర్, మోహన్, హరిప్రసాద్, ఆంజనేయులు, మానాజీపేట ఉపసర్పంచ్ వెంకటేష్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఓపెన్ చదువులకు అక్టోబర్ 23లోపు దరఖాస్తులు చేసుకోవాలి

**గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్**

**గద్వాల టౌన్ అక్టోబర్ 18, ప్రభాతవార్త:** ఓపెన్ టెన్త్, ఇంటర్ (2025-26)లో చదవడానికి ఆసక్తి గలవారు అక్టోబర్ 23 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓపెన్ స్కూల్ , ఇంటర్ విధానం ద్వారా విద్యను కొనసాగించడం వల్ల చదువును మధ్యలో ఆపివేసిన వారికి, ఉద్యోగులు, గృహిణులు,లేదా ఇతర బాధ్యతల కారణంగా సాధారణ పాఠశాలలకు హాజరుకాలేకపోయిన వారికి ఇది ఒక గొప్ప అవకాశం అని అన్నారు.టాస్ తెలంగాణ ఓపెన్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఓపెన్ టెన్త్ మరియు ఇంటర్మీడియట్ (202526) విద్యా సంవత్సరానికి జిల్లాలో 1780 మందికి అవకాశం కల్పించగా, ఇప్పటివరకు కేవలం 1065 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.మిగిలిన విద్యార్థులు 2025 అక్టోబర్ 23వ తేదీ లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని అన్నారు. జిల్లాలోని 17 సెంటర్లలో (పాఠశాలలు,కళాశాలల్లో) దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించబడిందని,విద్యార్థులు సమయానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుందని,విద్యార్థులు వెబ్‌సైట్‌ను సందర్శించి తమ వివరాలను నమోదు చేయాలని సూచించారు.టాస్ ద్వారా ఇచ్చే సర్టిఫికెట్లు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల కోసం అలాగే ఉన్నత విద్యకు కూడా సమానంగా ఉపయోగపడతాయని ఆయన వివరించారు.ఈ నేపథ్యంలో,అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలి

**బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్**

**పెబ్బేరు, అక్టోబరు 18 ప్రభాతవార్త :** బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత దక్కడానికి మొదటి నుండి బీసీ సమాజమంతా తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం తమకేమి సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ విమర్శించారు.శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో బీసీ పొలిటికల్ జెఏసి ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ బంద్ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుభాష్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో రాచాల మాట్లాడుతూ బీసీ పొలిటికల్ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు శాంతియుతంగా స్వచ్ఛందంగా బంద్ పాటించారని, బంద్ విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ బీసీల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఒక్కబస్సు కూడా డిపోల నుంచి బయటకు రాలేదని, ఈ బంద్ న్యాయమైనది కాబట్టి ప్రతి ఒక్కరూ సహకరించారన్నారు. ఏళ్ల తరబడి చూస్తున్న ఆకాంక్ష నెరవేర్చుకునే సమయం ఆసన్నమైందని, మొట్టమొదటి సారిగా కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసి రిజర్వేషన్లు పెంచి బిల్లులను గవర్నర్ దగ్గరికి పంపితే కేంద్రం అడ్డుకుంటుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో బీసీ రిజర్వేషన్లు చేర్చి ఉంటే న్యాయపరమైన అవరోధాలు ఉండేవి కావని, బీసీ రిజర్వేషన్ల చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపి ఉంటే హైకోర్టులో స్టే వచ్చేది కాదన్నారు.రిజర్వేషన్ సాధించే వరకు ప్రతి బీసీ బిడ్డ పోరాటం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి నాయకులు వివి గౌడ్, దేవర శివ, రాఘవేందర్ గౌడ్, బత్తుల జితేందర్, వడ్డె రాజు, చెలిమిల్ల రామన్ గౌడ్, నాగరాజు, నరేందర్ సాగర్, ధర్మేంద్ర సాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకురుమూర్తి ఆలయ చైర్మన్ పదవి బీసీలకు దక్కేనా..?



శ్రీ కురుమూర్తి స్వామి రాజగోపురం

**మహబూబ్‌నగర్ (చిన్న చింతకుంట), అక్టోబరు 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బీసీ నినాదం బలంగా వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలో వెలిసిన శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ చైర్మన్ పదవి బీసీలకు దక్కేనా అంటూ చర్చ కొనసాగుతుంది. తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడిగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి ఆలయం దేవాదాయ, ధర్మాదాయ శాఖలో కలిసిన తర్వాత 1969 నుంచి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీకురుమూర్తి స్వామి దేవస్థాన చైర్మన్లు గా మెజార్టీగా అగ్రవర్ణాలే పాలకమండలి చైర్మన్లుగా నియమించబడ్డారు. రెండు మార్లు మాత్రమే బీసీ సామాజిక వర్గ వ్యక్తులే చైర్మన్ గా నియమించబడ్డారు. 2002,03 సం.లో బాదం రామస్వామి, 2006 నుంచి 2008 వరకు హనుమంతరావు లు బీసీ సామాజిక వర్గం నుంచిదేవస్థాన చైర్మన్ లుగా వ్యవహరించారు. రెడ్డి సామాజిక వర్గ వ్యక్తులే శ్రీ కురుమూర్తి స్వామి ట్రస్ట్ చైర్మన్లుగా వ్యవహరించారు. గత సంవత్సరం నూతనంగా ఏర్పడిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం ట్రస్టు సభ్యుల పదవి కాలంఈనెల 25న ముగుస్తుండడంతో శ్రీకురుమూర్తి స్వామి ఆలయ ట్రస్టు చైర్మన్ గా బీసీలకు కేటాయించాలని మండలంలోని బీసీ సామాజిక వర్గం నేతలు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ప్రతిసారి శ్రీ కురుమూర్తి దేవస్థానం చైర్మన్ పదవి బీసీలను ఎంపిక చేస్తున్నామని చెబుతున్నారే తప్ప బీసీలకు అవకాశం దక్కడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈసారి కురుమూర్తి స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా బీసీలకు కేటాయిస్తారా లేదా.. వేచి చూడాలి. ఆలయ ఈవో మదినేశ్వర్‌రెడ్డి వివరణ... నూతన పాలక మండలి సభ్యుల పదవి కాలం ఈనెల 25న ముగుస్తుంది. 26న కొత్త పాలకమండలి పైదేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ ప్రకటిస్తామని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం ఈవో మహేశ్వర్ రెడ్డి ప్రభాతవార్తకు తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నూతన దేవస్థాన ట్రస్టు సభ్యుల ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు శ్రీ కురుమూర్తి బ్రహ్మోత్సవాల నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయలేదని ఈవో తెలిపారు.



శ్రీకురుమూర్తి స్వామి ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి

## అన్ని పార్టీల పోరాటం బీసీ రిజర్వేషనైతే ఇచ్చేదెవరు..?

**బీసీ బంద్‌లో అన్ని పార్టీలు యుద్ధం ఎవరి మీద..?**

**నారాయణపేట టౌన్, అక్టోబరు18 ప్రభాతవార్త:** బీసీలకు 42% రిజర్వేషన్ అమలు కోసం తెలంగాణ బందుకు పిలుపునిచ్చారు. బాగానే ఉంది కానీ బందులో అన్ని పార్టీలు మద్దతు తెలిపాయి. అన్ని పార్టీలు సపోర్టు చేస్తే మరి బంధు ఎవరికి వ్యతిరేకంగా జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వానికి..? రాష్ట్ర ప్రభుత్వానికి..? అసలు ఈ పోరాటం ఎవరిపైయని ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అన్ని పార్టీల నాయకులు బీసీ రిజర్వేషన్ కోసం పోరాడితే ఇచ్చేవారెవరంటున్నారు.ఈబందు స్పష్టతలేని బందుయని పలువురు తెలియజేస్తున్నారు. రిజర్వేషన్ అంశాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా చేసిన సవరణలను చూసి తెలంగాణకు బీసీ రిజర్వేషన్ ఇచ్చేలాకృషి చేయాలని ప్రధాని కోరారు. బీజేపీ పార్టీ బీసీ బంద్‌లో పాల్గొంటే ఎవరి మీద మీయుద్ధం అంటున్నారు. ఇప్పటికైనా తెలంగాణ బిజెపి ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

## శనైశ్చరస్వామికి తిల తైలాభిషేకాలు



శనైశ్చరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**బిజినేపల్లి అక్టోబర్ 18 ప్రభాతవార్త:** నంది వడ్డేమాన్ గ్రామంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా భక్తిశ్రద్ధలతో శనేశ్వర స్వామికి తిల తైలాభిషేకాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గవమఠం విశ్వనాథ శాస్త్రి శ్రీసార్ధాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి పాక్షిక శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేకంగా తిల తైల అభిషేకాల పూజలు నిర్వహించారు. ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలం నాటి బ్రహ్మ సూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు,అర్చనలు,గణపతి, నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచే నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్‌రావు,కమిటీ సభ్యులు రాజేష్,ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్‌చారి, శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ ఆర్చకులు గవ్వమఠం శాంతి కుమార్,ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్‌రెడ్డి భక్తులు,మహిళలు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ హాస్టల్ తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి



హాస్టల్ తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి

**నవాబుపేట, అక్టోబరు 18 ప్రభాతవార్త :** కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహాన్ని మండల ప్రత్యేక అధికారి సునీత, ఎంపీడీవో తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకొని మెనూ ప్రకారం పోషకాహార భోజనాన్ని అందజేయాలని స్పెషల్ ఆఫీసర్ మాధవికి ఈ సందర్భంగా వారు తెలియజేశారు. విద్యార్థినులు చదువుపై శ్రద్ధతో చదివి మంచి మార్కులు తెచ్చుకుని ఉన్నతమైన శిఖరాలను చేరుకోవాలని ఈ సందర్భంగా వారు విద్యార్థినులకు సూచించారు. వంటగదిని వసతి గృహ పరిసరాలను పరిశీలించారు. అనంతరం సీతాఫల ప్రాసెసింగ్ యూనిట్ ఐకెపి కార్యాలయాన్ని వారు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారితో పాటు ఎంపీడీవో జయరాం నాయక్,వసతి గృహ ప్రిన్సిపాల్ మాధవి, మండల అధికారులు, డిపిఎం, డిఆర్‌పి, ఏపిఎం, ఐకెపి అధికారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీగాయత్రి మహాయజ్ఞం



శాస్త్రోక్తంగా శ్రీగాయత్రి మహా యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

**బిజినేపల్లి, అక్టోబరు18 ప్రభాతవార్త:** విశ్వశాంతి లోక కళ్యాణార్థం, ప్రకృతి పర్యావరణ శుద్ధి కోసం నిర్వహించే శ్రీ గాయత్రీ మహా యజ్ఞంలో శనివారం పాలెం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. పతంజలి యోగ సమితి తెలంగాణ అధ్యక్షులు వస్పరి శివుడు ఆధ్వర్యంలో శ్రీగాయత్రి మహాయజ్ఞం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గాయత్రీ యజ్ఞం ప్రాముఖ్యత వివరిస్తూ జ్ఞానం, ఆరోగ్యము ఆధ్యాత్మిక శ్రేయస్సుతో ముడిపడి ఉందన్నారు. ఈ యజ్ఞం మనస్సును ప్రశాంతంగాఉంచి, ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంచుతుందని, ఇది శారీరక, మానసిక సమతుల్యతను సాధించడంలో సహాయపడుతుంది విశ్వానికి ఆత్మగా పరిగణించబడుతుంది అన్నారు.గాయత్రీ మంత్రం ద్వారా ఆధ్యాత్మిక ప్రాముఖ్యత వివరిస్తూ జ్ఞానోదయం లభిస్తుందని, ఇది మేధస్సును సన్మార్గంలో నడిపిస్తుందని చెప్పారు.క్రమం తప్పకుండా గాయత్రీ జపంచేయడం వల్ల పాపాలు తొలగిపోతాయని, దైవిక శక్తులు లభిస్తాయని భావిస్తారని చెప్పారు.జనన మరణ చక్రం నుండి విముక్తి పొందడానికి గాయత్రీ మంత్రం సహాయపడుతుందని కొన్నిగ్రంథాలు చెబుతున్నాయి అన్నారు .గాయత్రీ యజ్ఞాలు పర్యావరణ కాలుష్యాన్ని నివారించడంలో కూడా సహాయపడతాయని వివరించారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్త అజయ్ ఇంట్లో నిర్వహించిన శ్రీ గాయత్రియజ్ఞంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ రామన్న, శతాబ్ది ఉత్సవ ప్రముఖ్ జకీర్ హుస్సేన్, ముఖ్య శిక్షకులు విష్ణు,మహేష్‌రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాలెం ఖండ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు

**మహబూబ్‌నగర్ (చిన్న చింతకుంట), అక్టోబర్ 18 ప్రభాతవార్త:** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు శనివారం లెక్కించారు. శ్రీ కురుమూర్తి స్వామి ఆలయానికి తరలివచ్చే భక్తజనం స్వామిని దర్శించుకున్న అనంతరం కానుకల రూపేనా స్వామివారి హుండీలో వేసిన నగదును ఆలయ ఈవో మహేశ్వర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి సమక్షంలో హుండీ లెక్కించగా రూ.4,48,248 ల ఆదాయం రావడం జరిగిందని వారు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, బాదం వెంకటేశ్వర్లు, నాగరాజు, గోపాల్, భారతమ్మ, భక్తుడు కురుమూర్తి వెంకటేశ్వర రెడ్డి, సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా 'బీసీ' బంద్

- బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఆయా సంఘాలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు



బీసీ బందులో పాల్గొన్న అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు



బీసీ బంద్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు











బంద్ సందర్భంగా షాపులన్ని బంద్ చేసిన దృశ్యం

**గద్వాల టౌన్ అక్టోబర్ 18, ప్రభాతవార్త;** బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా ఎర్రవల్లి చౌరస్తాలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు.బి ఆర్.ఎస్ పార్టీ ముఖ్య ముఖ్య నాయకులు రవీందర్ రెడ్డి. శ్రీధర్ రెడ్డి. నారాయణ నాయుడు. వేణుగోపాల్ నాయుడు రాగన్న. కోటిరెడ్డి ఆయా గ్రామాల పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు బ్యానర్ చేత పట్టుకుని కార్యకర్తలతో కలిసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టపరంగా సాధించేందుకు జేఏఎస్ ఇచ్చిన పిలుపును వ్యాపారులు షాపులు మూసి బంద్‌కు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. చాలాచోట్ల ఎమ్మెల్యే స్వయంగా షాపులను ముగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చట్టపరంగా బీసీలకు 42 రిజర్వేషన్లు విద్య. ఉద్యోగ. స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి చట్టపరంగా బీసీలకు 42 శాతం శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రఘు రెడ్డి. వీరబాబు. శేషు. కృష్ణ సాగర్. వీరన్న.వెంకటరామిరెడ్డి ఆయా గ్రామాల కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బంద్.42 శాతం బీసీలకు రిజర్వేషన్లు సాధించుకునేందుకు బీసీ జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా ఎర్రవల్లి చౌరస్తాలో ఏఐసీసీ కార్యదర్శి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో కలిసి బంద్ లో పాల్గొని బీసీలకు 42 రిజర్వేషన్ కల్పించుకునేందుకు జేఏసీ ఇచ్చిన బంద్ కు వ్యాపారస్తులు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, బీసీలకు సంఘీభావంగా మూసి సహకరించాలని కోరుతూ పలు షాపుల వెంట తిరుగుతూ వ్యాపార షాపులను మూయించారు. అంతకుముందు జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, సీనియర్ నాయకుడు నల్లారెడ్డి, ఎర్రవల్లి మండల పార్టీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ జోగుల రవి, శ్యామ్ రావు, నర్సిరెడ్డి, పోతురాజు సోమనాద్రి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రుక్మానందరెడ్డి, మద్దిలేటి, బజారన్న, వెంకటేష్, బీచుపల్లి, ఆయా గ్రామాల నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొనగా అంతేకాక ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు మూయ్నిచి బందు కు సహకరించాలని మండల కేంద్రానికి చెందిన బీసీసంఘాల నాయకులు అధికారులను అభ్యర్థించారు.

**ఉప్పునుంతలలో:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల పిలుపు మేరకు శనివారం మండలంలో విజయవంతమైంది. మండలంలోని ఉప్పునుంతల, వెల్టూరు, పెనిమెళ్ళ, తాడూరు, కంసానిపల్లి గ్రామాలతో పాటు గ్రామ గ్రామాన స్వచ్ఛందంగాబంద్ నిర్వహించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో బీసీ సంఘం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ నాగయ్య గౌడ్ ఆధ్వర్యంలో బీసీలు అంబేద్కర్ చౌరస్తా నుంచి గ్రామంలోబైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోచమ్మ చౌరస్తాలో రాస్తారోకో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.అంతకుముందు గ్రామంలో వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు బంద్ చేయించారు.ఈ ఆందోళన కార్యక్ర మంలో బీసీ సంఘం నాయకులు మాజీ సర్పంచ్ నాగయ్య గౌడ్, పిఆర్‌టియు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సభావట్ బిచ్చ నాయక్ ,టిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు న్యాయవాది మేడమోని శ్రీనివాసులు,ఎల్లయ్య యాదవ్, చిన్న జంగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేడమోని భాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బిసి సెల్ మండల అధ్యక్షుడు మడ్డి తిరుపతయ్య గౌడ్,వెల్టూరి రేణయ్య, సిహెచ్ తిరుపతయ్య, బాల్ నారాయణయాదవ్, కర్నాటి వెంకటేశ్వర్లు, బింగిపర్వతాలు, శాలివాన సంఘం సభ్యులు మల్లయ్య, మేడమోని మల్లయ్య, బిజెపి నాయకులు ఎల్లయ్య యాదవ్, రవి నాయక్ , కాంగ్రెస్, బిఆర్ ఎస్, బిజెపి,బిసి సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయింపు మండలంలోని శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిలో ని వెల్టూరు స్టేజి వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. బీసీలకు 42 శాతం అమల్లోకి తీసుకొచ్చి స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకార్యక్రమంలో మాజీ సర్పంచ్ గున్నమోని లింగమయ్యయాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బూషి రాజ్ మల్లయ్య, గుద్దటి బాలరాజు,గోస్కె బాల్ రాజు, జంగయ్య, శేఖర్,కురుమయ్య, సమ్మద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెనిమెళ్ళ గ్రామంలో బీసీ నాయకులు వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు బంద్ చేసి విజయవంతం చేశారు. గ్రామాలలో రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా...మండలంలో గ్రామ గ్రామాన బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర బీసీ నాయకుల పిలుపు మేరకు మండలంలో శనివారం నిర్వహించినబంద్ కార్యక్రమంలోఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉప్పునుంతల ఎస్సై వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌బందోబస్తు నిర్వహించారు.గ్రామాలలో పోలీస్‌పహారా నిర్వహించారు.

**ఊర్కొండలో:**రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు బీసీలను చిన్నచూపు చూస్తున్నాయని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్య మాలు చేపడతామని బీసీ జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఉర్కొండ మండల కేంద్రంలో జడ్చర్ల-కోదాడ జాతీయ ప్రధాన రహదారిపై బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకో. రాష్ట్ర బంద్ కార్యక్రమం సంపూర్ణంగా కొనసాగింది. మండల నాయకులు పెద్ద సంఖ్యలో ఈ ధర్నాలో పాల్గొని మండలంలోని పాఠశాలలు, ప్రధానరోడ్లపై ఉన్న వ్యాపార సముదాయాలను బంద్ చేయించారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ బిసి బంద్ కార్యక్రమం విజయవంతమైందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఎప్పటి నుండో ప్రచారంలో ఉందని, కొందరు నాయకులు దీనిని కావాలనే నానబెట్టారనివెల్లడించారు. బీసీలను విస్మరిస్తే తగిన గుణపాఠం చెబుతామని ఘాటుగా విమర్శించారు. తక్షణమే బీసీ బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందేలా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి జేఏసీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**దామరగిద్దలో:** బిసిలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలని చేపట్టిన బంద్ సందర్భంగా దామరగిద్ద మండల కేంద్రంలో, మండల పరిధిలోని వివిధ గ్రామాలలోఅఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టి న బంద్ సందర్భంగా పాఠశాలలు, కాలేజీలు, దుకాణాలను బంద్ చేయిం చారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతు మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు పెద్దింటి రామకృష్ణ,అఖిలపక్ష పార్టీల నేతలు ఖాజా మియా,ఈదప్ప, జికె వెంకటప్ప, ఆనంద్, వీరప్ప,జోషి, శివకుమార్, గోపాల్ రావు, సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి మధు,నాయకులు రాజు,చంటి, వెంకటేష్ తదితరులు పాలొ ్గన్నారు.బీసీ జేఏసీ, పిలుపు మేరకు తెలంగాణ బంద్‌లో భాగంగా దామరగిద్ద ఉన్నత పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల,క్యాతన్‌పల్లి,బాపన్ పల్లి లో బీయికట్ చేసిన బీసీ యువ నాయకులు స్వచ్ఛందంగా బందుకు సహకరించారు.యువ నాయకులు గజలప్ప,జనార్ధన్,గణేష్,కుతుబుద్దిన్,బిసినాయకులు పాల్గొన్నారు.

**బాలానగర్‌లో:** బాలానగర్ మండల కేంద్రంలో శనివారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ, బీసీ సంఘాలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్ నిర్వహించారు. బంద్‌లో భాగంగా మండల కేంద్రంలో బైక్ ర్యాలీ, అనంతరం సంత బజార్ రోడ్‌లో మానవహారంగా ఏర్పడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీ నాయకులు మాట్లాడుతూ, జనాభాలో సగానికి పైగా బీసీ జనాభా ఉన్నప్పటికీ రిజర్వేషన్ ప్రక్రియలో మాత్రం వెనుకబడ్డామన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ప్రక్రియ ఆరు రోజుల్లో పూర్తి అయితే, బీసీ రిజర్వేషన్ అమలుకు మాత్రం అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. బీసీల రిజర్వేషన్ అమలుకై ప్రతి ఒక్క బీసీ నడుం బిగించి, రిజర్వేషన్ సాధనకై పోరాటం చేయాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.బీసీలకు న్యాయపరంగా రిజర్వేషన్లు దక్కకపోవడంతోఅన్ని రకాలుగా వెనుకబాటుకు గురవుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి చట్ట సవరణ చేసి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అన్నిరాజకీయ పార్టీ నాయకులు, బీసీ సంఘాలు, దళిత సంఘాలు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**నర్వలో:** బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు నారాయణ పేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండలంలో శనివారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరాల్సిందే అని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు సెలవులు ప్రకటించాయి. నర్వ మండల కేంద్రం లోని అంబేద్కర్ కూడలి వద్ద అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మరోవైపు వ్యాపార,వాణిజ్య సంస్థలు సైతం బంద్ కు మద్దతుగా నిలిచాయి.అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో శాంతియుత వాతావరణంలో ఈ బందు కొనసాగింది.

**నారాయణపేటలో:** బిసిలకు 42 రిజర్వేషన్ అమలు చేయాలని చేపట్టిన బంద్ లో భాగంగా శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో బంద్ విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ వేణు సైతం బందులు పాల్గొన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రిజర్వేషన్ అంశాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా చేసిన సవరణలను చూసి తెలంగాణకు బీసీ రిజర్వేషన్ ఇచ్చేలా కృషి చేయాలని ప్రధాని కోరారు. కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. బస్సులు బయటకు వెళ్లకుండా నారాయణపేట ఆర్టీసీ డిపో ముందు ఆందోళన చేపట్టారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్రం ఎందుకు సైలెంట్ గా ఉందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిజెపి ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

**నారాయణపేట టౌన్‌లో:** బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలని చెప్పి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేసిన అందరికీ బీసీల తరఫున డా.సాయిబాబా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా బందును విజయవంతం చేయడానికి పాల్గొని కృషిచేసిన ప్రతి ఒక్కరికి ప్రజలకుబీసీలతరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇలాగే అందరం కలిసికట్టుగా రిజర్వేషన్లు సాధించేవరకు ఈ పోరాటాలను కొనసాగించాలని ఈ పోరాటంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.



బిసి జెఎసి పిలుపుతో లింగాలలో వ్యాపార సంస్థలు బంద్

**చిన్న చింతకుంటలో:** తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రధాన డిమాండ్ తో చేపట్టిన రాష్ట్ర బంద్ శనివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో సంపూర్ణంగా కొనసాగింది.మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో కాంగ్రెస్, బిజెపి బిఆర్ఎస్ పార్టీల శ్రేణులు రోడ్డుపై బైఠాయించి బంద్ చేపట్టారు. మండల కేంద్రంలో వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలను మూయించి వేశారు. ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ కొనసాగించారు. ఉంద్యాలలో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు వేరువేరుగా రోడ్డుపైన బైఠాయించారు. బీసీ బంద్‌కు అన్ని పార్టీలు మద్దతు తెలిపిన గ్రామాలలో మాత్రం అధికార, ప్రతిపక్ష పార్టీలు వేరువేరుగాబంద్‌పాల్గొనడం చర్చినీయాంశమైంది.వడ్డేమాన్, చిన్న వడ్డేమాన్, నెల్లి కొండి, పర్దీపూర్ తదితర గ్రామాలలో బంద్ ప్రభావం కనిపించలేదు.

**లింగాలలో** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బిసి జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త బంద్ లింగాల మండల కేంద్రంలోని బంద్ విజయవంతంగా ముగిసింది. బంద్ లో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని బంద్ ను విజయవంతం చేశారు.వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. బస్సులు నడవకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

**రాజాపూర్‌లో:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం రాజాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన బీసీ బంద్ విజయవంతం అయ్యింది. ఈ బంద్‌లో బీసీనాయకులు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా బీసీలను మాత్రం మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. బీసీలు ఐకమత్యంతో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఉద్యమాలు చేసిమనకు రావాల్సిన వాటాను దక్కించుకోవాలని పలువురు బీసీనాయకులు పేర్కొన్నారు. బీసీ బంద్ ఉద్యమం ఇంతటితో ఆగదని,తిరిగి మరోమారు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. అంతకుముందు రాజాపూర్ ముఖ్య కూడలిలోర్యాలీగా వెళ్లిపలు దుకాణా సముదాయాలు, విద్యాసంస్థలు, పాఠశాలలను బంద్ చేయించారు. అనంతరం రాజాపూర్ మండల కేంద్రంలో తహసిల్దార్ రాధాకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బంద్‌కు మద్దతుగా మూసి ఉన్న దుకాణాల సముదాయం



బంద్‌లో పాల్గొన్న బిసి సంఘాల నాయకులు, అఖిలపక్షం నాయకులు









తహసీల్దార్ రాధాకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కల్వకుర్తి బంద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## బిజెపి వల్లే బీసీ రిజర్వేషన్ నిలిచింది

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అలసత్వం వల్లే 42 శాతం బీసీల రిజర్వేషన్ నిలిచిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసి చట్టబద్ధంగా రిజర్వే షన్లు కల్పించడానికి సలహాలు సూచనలు తీసుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. తద్వారా జనాభా దామాషా ప్రకారం 42శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పించడానికి అసెంబ్లీలో తీర్మానించి గజిట్ చేసి గవర్నర్‌కు పంపా మన్నారు. గవర్నర్ బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించలేదని ఆ తర్వాత రాష్ట్రపతికి కూడా రిజర్వేషన్లను పెంచుతూ చేసిన తీర్మా నాన్ని నివేదించామన్నారు. రాహుల్ గాంధీ సోనియా గాంధీ సీఎం రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే బీసీ బిల్లును ఆమోదించేలా చేయాలని అన్నారు.

## కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి

**బీసీల పోరాటానికి సంపూర్ణ మద్దతు**

**బీసీ బందులో గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి**




పాత బస్టాండ్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే, తదితరులు

**గద్వాల టౌన్ అక్టోబర్18, ప్రభాతవార్త:** బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి శనివారం తలపెట్టిన బీసీ సంఘాల జె ఏ సి బందు కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి పాల్గొనీ బందు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని పార్లమెంటులో చట్టం చేయాలనీ, న్యాయమైన 42 రిజర్వేషన్లు సాధించే వరకు బీసీల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బీసీ రిజర్వేషన్ల బంద్ కు మద్దతుగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలో తీశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన బంద్ లో నిరసన ర్యాలీ కార్యక్రమంలో సంపూర్ణ మద్దతు తెలుపుతూ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి గుండా ఎమ్మెల్యే బైక్ ర్యాలీలో పాల్గొని పాత బస్టాండ్‌లో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ, రాష్ట్రంలో బీజేపీ పార్టీ ఎంపీలు పార్లమెంటులో సమావేశాలలో చర్చించి వెంటనే బీసీలకు రిజర్వేషన్ కల్పించే విధంగా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**భూత్పూర్,అక్టోబర్ 18,ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బంధులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది.భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పోతులమడుగు గ్రామానికి చెందిన చాకలి ఖాసిం(48) కుటుంబ ఆర్థిక పరిస్థితులు,ఇబ్బంధుల కారణంగా గ్రామానికి చెందిన కోట్ల నారాయణ వ్యవసాయ పొలం పనులకు వెళ్లి చేను చల్లగా మిగిలిన క్రిమిసంహారక మందును ఈ నెల 16న తీసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు.విషయాన్ని గమనించిన తోటి కూలీ జోగు చెన్నప్ప సమాచారాన్ని గ్రామస్థులకు తెలుపగా,వ్యవసాయ పొలం యజమాని కోట్ల నారాయణ కుమారుడు అంజనేయులు తదితరులు అపస్మారక స్థితిలో ఉన్న చాకలి ఖాసింను జిల్లా ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఖాసం శనివారం ఉదయం మృతిచెందాడు.మృతుడు ఖాసిం భార్య చాకలి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## అనుచరుడిని సన్మానించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర,అక్టోబరు 18 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గంలోని ఎమ్మెల్యే స్వగృహంలో శనివారం ఫోటోగ్రాఫర్ ప్రశాంత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్య అనుచరుడు ఫోటోగ్రాఫర్ ప్రశాంత్ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని జైలుకు తరలింపు

**లింగాల, అక్టోబరు 18 ప్రభాతవార్త:** పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిని శనివారం జైలుకు తరలించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు. లింగాల గ్రామంలో దుర్గామాత ఊరేగింపు ఉత్సవాలలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అక్కడ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తో గొడవపడి తన విధులకు ఆటంకం కలిగించిన లింగాల గ్రామానికి చెందిన మాస్కాని అఖిల్ (21)ను అచ్చంపేట కోర్టులో జడ్జీ ముందు హాజరుపరచగా జడ్జీ అతనికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. ఎవ్వరైనా ప్రభుత్వ ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు.

## ఘనంగా నరేష్ నాయక్ జన్మదిన వేడుకలు

**రాజాపూర్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** యువ నాయకులు, గిరిజన ముద్దుబిడ్డ నరేష్ నాయక్ జన్మదిన వేడుకలు శనివారం రాజాపూర్ మండలం సింగమ్మగూడ గ్రామ పంచాయతీలో ఘనంగా నిర్వహించారు. తండా వాసులు, పలువురు యువకులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు నరేష్ నాయక్‌కుశాలువా కప్పికేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నరేష్ నాయక్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. మున్ముందు తనజన్మదిన మహోత్సవాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సందర్భంగా నరేష్ నాయక్ తెలిపారు.



నరేష్ నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

# ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీసీ బంద్ సంపూర్ణం

◆ ప్రజా రవాణా బంద్ ◆ మూతపడ్డ పెట్రోల్ బంకులు ◆ సాయంత్రం వరకు మూసి ఉన్న వ్యాపార సముదాయాలు ◆ బిసి సంఘాలకు రాజకీయ పార్టీల మద్దతు


నాగర్‌కర్నూల్‌జిల్లా కేంద్రంలో బంద్ ఉన్న వ్యాపార సముదాయాలు


బంద్‌తో కదలని ఆర్టీసీ బస్సులు





పాలెం: బంద్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్18 ప్రభాతవార్త:** బీసీ రిజర్వేషన్ల సాధనకై బీసీ సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించిన బంద్ సంపూర్ణంగా ప్రశాంతంగా విజయవంతమైంది. నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలలో బంద్ సంపూర్ణంగా ప్రశాంతంగా ముగిసింది. తెల్లవారుజాము నుంచే బీసీ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ వ్యాపార సంస్థలను మూసి ఉంచాలని కోరారు. బస్ డిపోల ముందు బస్సులు నడవకుండా ప్రధాన ద్వారాలు ముందు బైఠాయించారు. పెట్రోల్ బంకులు సినిమా హాల్లో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు మూసి ఉంచారు. ఆర్టీసీతో పాటు ఇతర ప్రజారవాణాను అడ్డుకున్నారు. దీంతో సాయంత్రం వరకు బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు బ్యాంకులు తెరిచిఉన్న కార్యాకలాపాలు సాగలేదు. ప్రైవేటుప్రభుత్వ రంగ సంస్థల ముందు బీసీ సంఘాల నాయకులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు మూసి ఉంచాలని నినాదాలుచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ధర్నాలు మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.బీసీ సంఘాలకు కాంగ్రెస్ బిజెపి వీఆర్ఎస్ సిపిఐ సిపిఎం బీఎస్పీ వంటి పార్టీలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించిబందులో పాల్గొన్నారు.శనివారం నాటి బీసీ సంఘాల బంద్ నేపథ్యంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ రఘు నాథ్ పరిస్థితులను సమీక్షించి ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పోలీసులకు దిశానిర్దేశం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

**ఆత్మకూర్ అక్టోబర్18, ప్రభాతవార్త;** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలంటూ అన్ని పార్టీల రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు శనివారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో బంధు ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం తెల్లవారు జామునుంచే అధికార కాంగ్రెస్ పార్టీ మరియు ప్రతిపక్ష టిఆర్ఎస్, బిజెపి, వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు పట్టణంలో కల్లి తిరుగుతూ షాపులను బంధు చేయించారు. అంతరం వేరువేరుగా ఆయా రాజకీయ పార్టీలు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ, నిరసన ప్రదర్శన నిర్వహిస్తూ గాంధీ చౌరస్తాలో సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో బిజెపి దొంగ వైఖరి అవలంబిస్తుందంటూ కాంగ్రెస్ పార్టీ అదే విధంగా బిజెపి మద్దతుగా బీఆర్ఎస్ పార్టీలు కూడా బీసీలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో ఆరోపించారు. వామపక్షాలు, టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు చెందిన నాయకులు మాత్రం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అణగారిన వర్గాల రిజర్వేషన్ కల్పించకుండా బీసీలను కేవలం ఓటు బ్యాంకు గానే పరిగణిస్తున్నాయంటూ ఆరోపించగా కాంగ్రెస్ పార్టీ కూడా రాష్ట్రంలో చిత్తశుద్ధితో బీసీలకు రిజర్వేషన్ కల్పించే విషయంలో పనిచేయడం లేదని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ కాంగ్రెస్ బిజెపి వామపక్షాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**వడ్డేపల్లి, అక్టోబరు18 ప్రభాతవార్త:** అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లో అఖిలపక్షం, ప్రజా సంఘాల అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ వాణిజ్య, వ్యాపార సంస్థలు, విద్యాలయాలు బంద్ చేయడం జరి గింది. అనంతరం అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ బిసిలకు 42 రిజర్వేషన్లను సాధించుకునేందుకు ఐక్యంగా ఉద్యమిద్దామని తెలంగాణ బంద్ బిసిల హక్కు 42 శాతం రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాల న్నారు, బిసిలను నిర్లక్ష్యం చేయడం సమాజానికి అన్యాయం, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని,ఈ ఉద్యమం బీసీల న్యాయ హక్కుల కోసం, అన్ని వర్గాలు, అన్ని కులాలు, అన్ని రాజకీయ శక్తులు కలసి బీసీల సాధనలో భాగస్వాములై కలిసి కట్టుగా బిసిల రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం కొనసా గుతుందన్నారు. ఈ తెలంగాణ జేఏసీనాయకుడు వై.రామ్మో హన్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కొంకల భీమన్న, వడ్డేపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సూరి, కెవిపిఎస్ జోగు లాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఎ.పరంజ్యోతి, వడ్డేపల్లి బిజెపి మండల అధ్యక్షుడు నాగరాజు,బిజెపి నాయకుడు మధుసూదన్ గౌడ్, బీఎస్పీ నాయకుడు నరసింహ, గొంగల తిప్పన్న, నాయకి గోపాలు,కెవిపిఎస్ మండల అధ్యక్షుడు కొంకల యువ రాజు, ఎమ్మార్పీఎస్ కోయల్ దీన్నే శేఖర్,ఎమ్మార్పీఎస్ నాయకుడు ఏసేపు,పైపాడు వడ్డేపల్లి ఎమ్మార్పీ ఎస్ మండల అధ్యక్షుడు, కొంకల అమరేందర్ యాదవ్, బీసీ నాయకుడు, కేపీ ఈదన్న బీసీ నాయకుడు గోకారి, మాజీసర్పంచ్ ఎమ్మార్పీఎస్ మహేష్, అఖిలపక్షం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**శ్రీరంగాపూర్, అక్టోబరు18 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో శనివారం రోజు తలపెట్టిన బందులో భాగంగా పొలిటికల్ జేఏసీ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు స్వచ్ఛందంగా బందులో పాల్గొనడం జరిగింది. బిఆర్ఎస్ నాయకులు బైకులతో ర్యాలీ చేయడం జరిగింది. బీసీ రిజర్వేషన్లు 42 శాతం సాధించడం ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు కాదని, తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ ఉద్యమాన్ని గ్రామస్థాయి వరకు తీసుకువెళ్లి బీసీల భవిష్యత్తుకు బాటలువేసుకునేలా బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. బందు కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల పొలిటికల్ జేఏసీ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

**బిజినేపల్లి, అక్టోబరు18 ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రాష్ట్ర బంద్ పిలుపులో భాగంగా శనివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బంద్ విజయవంతమయింది. బీసీ జేఏసీ ప్రకటించిన బంద్‌కు ఆయా పార్టీ శ్రేణులు, సంఘాల నాయకులుమద్దతు ప్రకటించారు. విద్య, వ్యాపార, వాణిజ్య, అన్ని వర్గాలుబంద్‌కు సంపూర్ణంగా మద్దతు తెలిపారు. మండల కేంద్రంలోని పూలే అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ బీసీ సంఘాల జేఏసీ నాయకులు తీవ్రంగా ఖండించారు.బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ ఉద్యమం బీసీల న్యాయహక్కుల కోసం,ఏ పార్టీకి వ్యతిరేకం కాదని, అన్ని వర్గాలు,అన్ని కులాలు, అన్ని రాజకీయశక్తులు కలసి బీసీల సాధనలో భాగస్వాములై కలిసికట్టుగా బిసిల రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం కొనసాగు తుందన్నారు. వంటా వార్పు ఆయా పార్టీ శ్రేణులు, సంఘాల నాయకులు పాల్గొని అక్కడే భోజనం చేశారు.
















**ధన్వాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ధన్వాడ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా, సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్,కాంగ్రెస్, సిపిఎం, బిఆర్ఎస్, పిడి ఎస్‌యు, పివైఎల్, బిఎస్పి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రవేట్ స్కూల్ ప్రభుత్వ పాఠశాలలుబ్యాంకులను మూసివేసి బందు పాటించాలని కోరడమైనది.ఈ సందర్భంగా పిడి ఎస్‌యు జిల్లా కోశాధికారి బి.మహేష్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వమే అమలు చేయాలని దీంట్లో నిర్లక్ష్యం బిజెపి కేంద్ర ప్రభుత్వం ఉందని అన్నారు, ప్రజలను అయోమయానికి గురి చేయడానికి నేటి బంద్‌లో బిజెపి పాల్గొనడం కూడా విడ్డూరంగా ఉందని అన్నారు, ఇప్పటికైనా తెలంగాణలోని ఇద్దరు కేంద్ర మంత్రులు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎంపీలు కేంద్రంతో మాట్లాడి బీసీ రిజర్వేషన్లు సాధించాలని ఆయన వారిని డిమాండ్ చేశారు, లేకపోతే భవిష్యత్తులో జరిగే బీసీలకు 42 రిజర్వేషన్ల కోసం ఉద్యమాలను అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమాలన్ని చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**దేవరకద్ర, అక్టోబరు18 ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ, కౌకుంట్ల మండల కేంద్రంలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో బంద్ జరిగింది. వ్యాపార విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. బీసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపబోమని అఖిలపక్ష నేతలు ప్రకటించారు. కౌకుంట్ల మండల కేంద్రంలో గల అఖిలపక్ష నాయకులు, కార్యకర్తలు, పాల్గొని మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ప్రైవేట్ పాఠశాలలు వ్యాపార సముదాయాలు తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, హోట ల్లు, మూసివేసి బందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌకుంట్ల మండల అఖిలపక్ష నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







**మక్తల్ టౌన్, అక్టోబరు 18 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో బిసి రిజర్వేషన్ బంద్‌కొరకు విపక్షాలు ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ బందు మధ్యాహ్నం వరకు సంపూర్ణంగా బందును పాటించిన దుకాణా దారులు మధ్యాహ్నం నుంచి అంతంత మాత్రంగా కొనసాగింది. బస్సులు సంపూర్ణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోగా ప్రైవేటు వాహనాలను తీసుకొని వాహనా దారులు వారి నిత్య నిత్య కృత్యాలను కొనసాగించారు.బీసీ బందు కొరకు 42 శాతం రిజర్వేషన్ కు పూర్తిగా మద్దతు తెలిపిన వామపక్షాలన్నీ సంపూర్ణంగా మద్దతు పలికాయి. రోడ్డుపైకి వచ్చి అంబేద్కర్ కూడలి వద్దకు చేరి వారి నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగంలో కల్పించిన హక్కులో భాగంగా జనాభా దామాషా ప్రకారం 42% రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం 9షెడ్యూల్లో చేర్చాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రవర్ణాలు ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు 10 శాతం రిజర్వేషన్లను 24గంటల్లో పార్లమెంట్ లో తీర్మానం చేసి అమలు చేసుకున్నారు కానీ బీసీలు 56% పైగా ఉన్నటువంటి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం 9 షెడ్యూల్లో చేర్చడంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు బీసీలను ఓట్ బ్యాంకుగా వాడుకోవడం తప్ప బీసీలకు రాజకీయంగాలబ్ధి చేకూరాకుండా తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నాయని వారు మండిపడ్డారు. రామాంజనేయులుగౌడ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష నాయకుల బంధు సంపూర్ణంగా విజయవంతమైంది. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏరవికుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కిరణ్, పృథ్వీరాజ్, మద్దిలేటి, బీసీ రాష్ట్ర కోశాధికారి జి.రంగప్ప యాదవ్,నారాయణపేట జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ ముదిరాజ్ జిల్లా నాయకులు బుట్టో ,యూత్ కాంగ్రెస్ నాయకులు వేణు గౌడ్,బీసీ ఐక్యవేదిక మక్తల్ నియోజకవర్గం యువత అధ్యక్షులు అశోక్‌గౌడ్, అధ్యక్షుడు రవికుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు గోలపల్లి జ్ఞాన ప్రకాష్, బీసీ,ఎస్సీ, ఎస్టీ జేఏస్ నాయకులు వీరేష్, నాయకులు అఫ్రోజ్ ,కళ్యాణ్ రాజు తదితర అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

**నవాబుపేట,అక్టోబరు 18 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్ అన్ని పార్టీలు బైకు ర్యాలీలతో తెలంగాణ బందును విజయవంతం చేశారు. శనివారం అగ్ర కులాల వారు ఓర్వలేక హైకోర్టులో కేసు వేసి 42 రిజర్వేషన్లను అమలు కాకుండా అడ్డుకుంటున్నారని అన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలు మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం బీసీలను రాజకీయంగా బీసీలను ఎదగకుండా అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 60శాతం ఉన్నబీసీలను రాజకీయంగా వెనుకకు నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వే షన్లు అమలుకాకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు, బంద్‌లు పాటిస్తూ ఉద్య మాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బంద్‌కు అన్ని పార్టీలు మద్దతు తెలుపుతూ బందును విజయవంతం చేశారు.

**ఊట్కూర్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** బీసీ రిజర్వేషన్ల పెంపు కోసంరాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చిన బంధ్‌కి ఊట్కూర్ మండల ప్రజలు, వ్యాపారులు, విద్యార్థులు ఘనమైన మద్దతు తెలిపారు.ఉదయం నుంచే మండల వ్యాప్తంగా దుకాణాలు,విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. బీసీ సంఘాల ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు బీఎస్పీ, కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్ నాయకులు కూడా బంద్‌కు మద్దతు ప్రకటించారు. జనాభా ఎంత వాటా అంత" అంటూ నినాదాలు చేస్తూ బీసీ హక్కుల కోసం ప్రజలు ర్యాలీలలో పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూబీసీ వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బంద్ శాంతియుతంగా,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ముగిసింది.

**పెబ్బేరు, అక్టోబరు 18 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలో బీసీ బంద్ విజయవంతంగా ముగిసింది. స్థానిక సుభాష్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు పాల్గొని ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ పట్టణంలోని సుభాష్ చౌరస్తాలో అన్ని పార్టీలు ఏకమై బైక్ ర్యాలీ,ధర్నా, రాస్తారోకో బందు నిర్వహించారు. అన్ని పార్టీలు ఒకే వేదికపై మొదటిసారిగా బీసీల కోసం కొట్లాడడం మొదటి సారి అని ప్రజలు చర్చించుకుంటున్నారు, కానీ ఏపార్టీ ఇస్తుందో ఏపార్టీ మద్దతు ఇస్తుందో అసలు బీసీలకు రిజర్వేషన్ ఇస్తారా ఇయరా అనే దానిపై ప్రజలు అయోమయంలో ఆలోచిస్తున్నారు.అసలు బీసీల రిజర్వేషన్ ఏపీ ద్వారా అమలు చేస్తుందో వేచి చూడాల్సిన అవసరం ఏర్పడిందని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శనివారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో బిజెపి, కాంగ్రెస్, టీఆర్ఎస్, సీపీఐ, బిసి పొలిటికల్ జేఏసీ, తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలు నాయకులు పాల్గొని ప్రశాంతంగా ధర్నాను విజయవంతం చేశారు.

**ఉర్కొండ, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు బీసీలను చిన్న చూపు చూస్తున్నాయని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్య మాలు చేపడతామని బీసీ జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఉర్కొండ మండల కేంద్రంలో జడ్చర్ల–కోదాడ జాతీయ ప్రధాన రహదారిపై బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకో. రాష్ట్ర బంద్ కార్యక్రమం సంపూర్ణంగా కొనసాగింది. మండల నాయకులు పెద్ద సంఖ్యలో ఈ ధర్నాలో పాల్గొని మండలంలోని పాఠశాలలు, ప్రధాన రోడ్లపై ఉన్న వ్యాపార సముదాయాలను బంద్ చేయించారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ బిసి బంద్ కార్యక్రమం విజయవంతమైందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఎప్పటి నుండో ప్రచారంలో ఉందని, కొందరు నాయకులు దీనిని కావాలనే నానబెట్టారని వెల్లడించారు. బీసీలను విస్మరిస్తే తగిన గుణపాఠం చెబుతామని ఘాటుగా విమర్శించారు. తక్షణమే బీసీ బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందేలా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి జేఏసీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**దామరగిద్ద, అక్టోబరు 18 ప్రభాతవార్త:** బిసిలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలని చేపట్టిన బంద్ సందర్భంగా దామరగిద్ద మండల కేంద్రంలో, మండల పరిధిలోని వివిధ గ్రామాలలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ సందర్భంగా పాఠశాలలు, కాలేజీలు, దుకాణాలను బంద్ చేయించారు.మాట్లాడుతు మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు పెద్దింటి రామకృష్ణ, అఖిలపక్ష పార్టీల నేతలు ఖాజా మియా , ఈదప్ప, జికె వెంకటప్ప, ఆనంద్, వీరప్ప, జోషి, శివ కుమార్, గోపాల్ రావు, సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి మధు,నాయకులు రాజు,చంటి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.బీసీ జేఏసీ, పిలుపు మేరకు తెలంగాణ బంద్‌లో భాగంగా దామరగిద్ద ఉన్నత పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల, క్యాతన్‌పల్లి,బాపన్ పల్లి లో బీయికట్ చేసిన బీసీ యువ నాయకులు స్వచ్ఛందంగా బందుకు సహకరించారు. ఈకార్యక్రమంలో యువ నాయకులు గజలప్ప, లాలప్ప, జనార్ధన్, గణేష్,కుతుబుద్దిన్, బిసి నాయకులు పాల్గొన్నారు.

**మద్దూరు,అక్టోబరు 18ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీలు సంయుక్తంగా నిరసన కార్యక్రమం నిర్వహించాయి. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, సీపీఐ, సిపిఎం పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు నినాదాలతో ధర్నా చేపట్టి, వ్యతిరేక నినాదాలతో తీవ్రంగా విమర్శించుకున్నారు.నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో బీసీలు రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్నా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలుగా ఉన్నారని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, తక్షణమే బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని, శాసనసభలో ఆమోదం తీసుకురావాలని డిమాండ్ చేశారు.అలాగే, బీసీ వర్గాల హక్కుల కోసం అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళనలు, ర్యాలీలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు ప్రముఖులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**భూత్పూర్,అక్టోబర్ 18,ప్రభాతవార్త:** కాంగ్రెస్ తీసుకొచ్చిన బీసీల 42శాతం రిజర్వేషన్ అమలుకు నోచకొనకపోవడంతో ఆగ్రహించిన ఆయా పార్టీలలో ఉన్న బీసీ నాయకులు,బీసీ సంఘాలు శనివారం ఇచ్చిన బంద్ పిలుపు ఆయా పార్టీల బీసీ నేతలు,బీసీ సంఘాలు,వివిధ సంఘాల సభ్యులు స్పందించి స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలుపుతూ బంద్‌లో పాల్గొన్నారు.బంద్ ప్రభావంతో భూత్పూర్ హైవే కూడలి నిర్మానుషంగా మారింది.ఆర్టీసీ బస్సులు నడపలేదు. దుకాణాలు,వ్యాపార సంస్థలు, హోటళ్లు, కిరాణాలు,బడ్డీ కొట్లు,చిల్లరవ్యాపారస్థులు స్వచ్చం దంగా బంద్ పాటించారు. ఆయా పార్టీల బీసీ నేతలు,కార్యకర్తలు శనివారం ఉదయం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని హైవే కూడలికి చేరు కుని ర్యాలీలు,నిరసనలు,ధర్నాలునిర్వహించారు.బీసీలకు కొంత అండంగా ఉండేది తమ పార్టంటే తమ పార్టని చెప్పుకుంటూ బీసీల 42శాతం రిజర్వేషన్ అమలుకు అలుపెరగని పోరాటాలు చేస్తామని బీసీ నాయకులు,కార్యకర్తలు పార్టీల పరంగా నిరసనలు,ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు.

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో:** బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు చట్టం రూపొందించి పార్లమెంట్ ఆమోదింపజేసి రాజ్యాంగం తొమ్మిదో షెడ్యూల్డ్‌లో పొందుపర్చా లని డిమాండ్ చేస్తూ,ఈ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని పేర్కొంటూ,రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు చటబద్ధతతో కూడిన రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చూస్తూ భూత్పూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు భూత్పూర్ పట్టణ కేంద్రంలోని హైవే కూడలిలో నిరసన,భారీ ర్యాలీ,రొడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వ రాజ్‌గౌడ్,భూత్పూర్ మండల బీసీ జేఏసీ మేకల సత్యనారాయణ,ఇతర నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు కానీ బీసీల 42శాతం రిజర్వేషన్ సాధ్యంకాదని తెలిసి కూడా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సమాజం,బీసీలను మభ్యపెడుతూ మరో సారి మోసం చేసిందని ఆరోపించారు.ఈ కార్యక్ర మంలో పార్టీ బీసీ నాయకులు మనెమోని సత్యనారాయణ,సత్తూర్ నారాయణగౌడ్,టి మురళీధర్‌గౌడ్, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, గద్దం ప్రేమ్ కుమార్, గద్దం రాములు, సత్తూర్ అశోక్‌గౌడ్ , మొహ్మద్ సాధిక్, మొ హ్మద్ యాసిన్, వ యూ ష సాయిలు, తూము శ్రీనివాస్ రెడ్డి , ఆకుల వెంకటయ్య,సత్తూర్ రాకేష్ గౌడ్, గొడుగు వెంకటరాజు, నరేష్‌గౌడ్, పులుగుర్ల మల్లేష్,ఎండి జాకీర్,ఎండి, ఫసియొద్దిన్,ఎండి షాకీర్,దొబ్బలి శ్రీశైలం, మండి ఆటో వెంకటయ్య,సత్తూర్ తిరుపతయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో:** బీసీల 42శాతం రిజర్వేషన్‌కు ఎవరూ అడ్డుపడకుండా సజావుగా అమలు చేసేందుకు అన్ని పార్టీలు సహకరించా లని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తమ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల 42శాతం రిజర్వేషన్ అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని,బీసీల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొంటూ,బీసీ బంద్‌కు మద్దతు గా భూత్పూర్ కాంగ్రెస్ పార్టీలోని బీసీ నాయకులు, కార్యకర్తలు,పార్టీ ఇతర నాయకులు శనివారం భూత్పూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.బస్టాండ్ కూడలిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మందడి నర్సింహ్మారెడ్డి,బోరింగ్ నర్సింహులు, లిక్కి విజయ్‌గౌడ్,టి గోవర్ధన్‌గౌడ్,జైదు శ్రీనివాసులు, రావుల పల్లి నర్సింహులు, మాసగౌడ్,సంజీవరెడ్డి,అబుబాకర్ సిద్ధిఖీ, ఆగిరి రవి,ప్రతాప్‌రెడ్డి,మల్లేష్,ఎర్రవాపు నర్సింహులు, తమన్నగౌడ్, లక్ష్మయ్య,కెంద్యాల రాజేష్ పాల్గొన్నారు.

**బీజేపీ ఆధ్వర్యంలో:** తమకు 42శాతం రిజర్వేషన్ తప్ప నిసరిగా ఉండాలని పేర్కొంటూ,బీసీలు,బీసీ సంఘాలు శనివారం నిర్వహించిన బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు తెల్పుతూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు భూత్పూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.భూత్పూర్ చౌరస్తా,పాలమూర్ రోడ్,శివాలయం రోడ్‌ల మీదుగా ర్యాలీ సాగింది.అనంతరం భూత్పూర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు రొడ్డుపై బేఠాయించి తమ నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గూటం శ్రీను,జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎండి ఫారూక్, కెంద్యాల శ్రీనివాస్(ఐదిండ్ల శ్రీను), నర్సింహ్మా, సత్తూర్ సత్తయ్యగౌడ్, రాజశేఖర్, మహేష్‌యాదవ్, పట్నం శ్రీశైలం, మహానంది తదితరులు పాల్గొన్నారు.


బంద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు


డిపో వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్షం నాయకులు


వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ






















